రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# వ్యవస్థ నిర్లక్ష్యంపై కాడెద్దుల సమరం



రైతు తన ఎడ్లతో నిరసన తెలుపుతూ యాచారం రెవెన్యూ కార్యాలయాన్ని దిగ్భంధించటంతో బయటికి వచ్చి హామీ ఇస్తున్న అధికారులు

**◗15 ఏళ్ల అన్నదాత ఆక్రోశం.. ◗ పట్టాదారు పాస్ బుక్ ఇవ్వడంలో రెవెన్యూ వర్గాల నిర్లక్ష్యం ◗తహసీల్దార్ ఆఫీస్ ముందే బాధిత రైతు వినూత్న యుద్ధం ◗మద్దతు తెలిపిన స్థానికులు ◗యాచారంలో ఉద్రిక్తత ◗దిగి వచ్చిన అధికార యంత్రాంగం**

**యాచారం, జూన్ 29 ప్రభాతవార్త:** వ్యవస్థ నిర్లక్ష్యానికి, పాలకుల ఉదాసీనతకు అద్దం పడుతూ రంగారెడ్డి జిల్లా యాచారం తహసిల్దార్ కార్యాలయం సాక్షి గా ఒక హైడ్రామా నడిచింది. న్యాయం కోసం ఏళ్ల తరబడి కాళ్లు అరిగేలా తిరిగినా పైసా లాభం లేకపోవడంతో, విసిగి వేసారిన ఓ రైతు చివరకు అధికారుల కళ్లు తెరిపించేందుకు వినూత్న సమర శంఖం పూరించాడు.

**పాస్‌బుక్ లేక సంక్షేమ పథకాలకు దూరం**

మొగుళ్ళ వంపు గ్రామానికి చెందిన రైతు పాండురంగారెడ్డికి సర్వే నెంబర్ 98లో తన అన్నదమ్ములతో కలిసి 16 ఎకరాల 20 గుంటల భూమి ఉండేది. అందులో కాలక్రమేణా కొంత భూమి విక్రయించగా, మిగిలిన భూమిలో తన వాటాకు రావాల్సి న మూడు ఎకరాలకు పట్టా పాస్ బుక్ ఇచ్చి ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటూ గడిచిన 15 ఏళ్లుగా తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు. కానీ, ఏ అధికారి కూడా అతని బాధను పట్టించుకోకపోవడంతో, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమై నిలువునా నష్టపోయాడు. ఇక లాభం లేదనుకున్న పాండురంగారెడ్డి, సోమవారం నేరుగా తన కాడి ఎడ్లను తోలుకుంటూ యాచారం తహసీల్దార్ కార్యాలయం ముందుకు వచ్చి అక్కడే నిరసనకు దిగాడు. కార్యాలయం గేటు ముందే ఎడ్లను నిలబెట్టి, తహసీల్దార్ ఆఫీసును ముట్టడించడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యాలయానికి వచ్చిన ఇతర రైతులు, ప్రజలు ఈ వినూత్న నిరసనను చూసి రైతుకు మద్దతుగా నిలిచారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. అంజయ్య, నాయకులు ఏ. మల్లేష్, రాములు తదితరులు రైతుకు అండగా నిలిచారు. రైతు కాడి ఎడ్లతో ఆఫీసు ముందుకు రావడం, దానికి తోడు రాజకీయ నాయకుల మద్దతు పలకడంతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. పరిస్థితి చేతులు దాటుతోందని గమనించిన యాచారం తహసీల్దార్ అయ్యప్ప వెంటనే ఛాంబర్ నుంచి బయటకు వచ్చి రైతుతో మాట్లాడారు. "పూర్తి వివరాలతో అధికారికంగా ఫిర్యాదు చేయండి... రికార్డులన్నీ స్వయంగా పరిశీలించి చట్టపరంగా పూర్తి న్యాయం చేస్తా" అని బహిరంగంగా హామీ ఇవ్వడంతో సీన్ కాస్త చల్లబడింది. తహసిల్దార్ ఇచ్చిన నమ్మకంతో రైతు పాండురంగారెడ్డి తన 15 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఇప్పటికైనా మోక్షం లభిస్తుందనే ఆశతో ఆందోళన విరమించాడు.

## అర్ధరాత్రి బాలికల హాస్టల్‌లో కలకలం

**భవనం నుంచి దూకిన ఇంటర్ విద్యార్థిని**

**రెండు కాళ్లు విరగడంతో గాంధీ ఆస్పత్రికి తరలింపు**

**విచారణ చేపట్టిన అధికారులు**

2లో

గాయపడిన విద్యార్థినిని గాంధీకి తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు



# కోటపల్లిపై యాసంగి ఆశలు



ముమ్మరంగా సాగుతున్న కోటపల్లి ప్రాజెక్టు అలుగు, కాల్వల పనులు



**శరవేగంగా ఆధునీకరణ పనులు**

**ప్రాజెక్టు అభివృద్ధికి రూ.89.30 కోట్లు**

**మూడు కాల్వలు, అలుగు రిపేర్లు**

**ఇప్పటికి 65 శాతం పనులు పూర్తి**

**గత పాలకుల హయాంలో మొండిచేయి**

**59 ఏళ్ల చరిత్రలో సరికొత్త రికార్డు**

**జనవరి లోపు పూర్తి చేయాలని లక్ష్యం**

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)**

వికారాబాద్ జిల్లాలోని కోటపల్లి మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో రాబోయే యాసంగి పంటలకు సాగునీరు అందుతుందనే ధీమా రైతాంగంలో వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరందించే యోచనలో అధికారులు ఉండటంతో పాటు, ప్రస్తుతం ప్రజాక్టు పనులు ఊపందుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆధునికీకరణ పనుల కోసం రూ.89.30 కోట్లు కేటాయించగా, 59 ఏళ్ల కోటపల్లి ప్రాజెక్టు చరిత్రలో ఇంత భారీగా నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారి. గతంలో ఎన్నో అంచనాలు రూపొందించినా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కూడా గత పాలకులు ఈ జిల్లాకు మొండిచేయి చూపించారు.

**ముగ్గురు మొనగాళ్ల ప్రత్యేక చొరవ**

ప్రస్తుతం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, తాండూరు శాసనసభ్యుడు బుయ్యని మనోహర్రెడ్డి ప్రత్యేక చొరవతో భారీగా నిధులు మంజూరు చేశారు. ఆరు నెలల నుంచి పనులు సాగుతున్నాయి. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తయ్యాయి. జనవరి మాసంలోగా పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ, బేబీ కాల్వల పునర్ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. 24 కిలోమీటర్ల పొడవు గల కుడి కాల్వ పనుల్లో ఇపటి వరకు 21 కిలోమీటర్ల మేరకు పూర్తి చేశారు. మరో మూడు కిలోమీటర్ల పనులు సాగుతున్నాయి. వర్షాకాలం ఆరంభం కావడం వల్ల పనులకు కొంత అంతరాయం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఎడమ, బేబీ కాల్వల పనులు చేపడుతున్నారు. కట్ట ఆధునీకరణతో పాటు అలుగు పనులు దాదాపు పూర్తవుతున్నాయి.

**మార్చి కల్లా సాగునీరు**

ఆరు నెలల్లో దాదాపు ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు. యాసంగి పంటలకు నీరు అందించే యోచనలో ఉన్నామని సహాయ ఇంజనీరు సాయి తెలిపారు. వాతావరణ పరిస్థితుల ఆధారంగా మార్చి వరకూ పనులు సాగవచ్చని అంటున్నారు.

**మర్రి చెన్నారెడ్డి హయాంలో అంకురార్పణ**

1967లో కోటపల్లి ప్రాజెక్టు పనులకు అంకురార్పణ జరిగింది. దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి ఇదే జిల్లా వారైనందున నిధులు మంజూరు చేశారు. జిల్లాలో భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి నిబంధనలు అడ్డుగా ఉన్నందున మధ్యతరహా, చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. ఇక్కడి >>2

# ఏరువాక సాగాలో రన్న..



బషీరాబాద్‌లో బసవన్నల ఊరేగింపు

**గ్రామీణ ప్రాంతాలలో పౌర్ణమి వేడుకలు**

**వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు**

**ప్రత్యేక అలంకరణలతో బసవన్నల ఊరేగింపు**

**గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు**

**పెద్దేముల్/పూడూరు/కొడంగల్, జూన్ 29, ప్రభాతవార్త:** ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో పండగ వాతావరణం నెలకొంది. కొండంత ఆశ, గుండె నిండా ధైర్యంతో రైతన్నలు నాగలి పట్టారు. పొలంలోకి దిగి దుక్కి దున్నారు. అనేకచోట్ల ప్రజాప్రతినిధులు కూడా భూమాతకు పూజలు చేసి రైతులతో కలిసి విత్తనాలు చల్లారు. సోమవారం పెద్దేముల్ మండలం ఇందూరులో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుకలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రుద్రారం పి.మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. యువత వ్యవసాయంలో ఆధునిక సాంకేతికను వినియోగించాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. రైతుల సంక్షేమమే దేశాభివృద్ధి పునాది అని, రైతుల శ్రమ, త్యాగాన్ని కొనియాడారు. పంట బీమా, రుణ సౌకర్యాలు, మార్కెటింగ్ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్లపాపలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పూడూరు మండలం పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ఏరవాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం తొలకరివర్షాల తొలినాళ్లలో వచ్చే ఏరువాక పౌర్ణమికి గ్రామాల్లో ఈ సందడి నెలకొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మండలంలోని కడ్మూరు, పూడూరు, కంకల్, సోమన్‌గుర్తి, మంచన్‌పల్లి, పెద్ద ఉమ్మెంతాల్, ఎన్కెపల్లి, రాకంచెర్ల, చెన్‌గోముల్, మిట్టకంకల్, అంగడి చిట్టంపల్లి, నిజాంపేట్ మేడిపల్లి, తుర్కఎన్కెపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో రైతులు ఉదయాన్నేలేచి తమ ఇళ్లనుశుభ్ర పరుచుకొని, స్నానాలు ఆచరించి, వివిధ రాకాల (బక్షాలు)పిండివంటలను తయారుచేశారు. ఎద్దులను శుభ్రంగా కడిగి పలు రకాలరంగులతో అలంకరించారు. స్థానిక ఆలయాల చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిండివంటలతో తయారు చేసిన (పుల్గం)భక్షాలను పశువులకు పెట్టారు.

ఏరువాక సాగాలో రన్నా చిన్నన్నా..నీ కష్టమంతా తీరెనురో చిన్నన్నా అంటూ..ఏరువాక పౌర్ణమి వేడుకలను సోమవారం కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రైతులు ఘనంగా జరుపుకున్నారు. తమతమ ఎద్దులకు శుభ్రంగా స్నానాలు చేయించి రంగురంగుల దుస్తులు, బాసింగాలతో అలంరించి ఊరుగింపుగా తీసుకువచ్చారు. అనంతరం పసుపు, నూనే, బెల్లం,కలీ, వడ్లు, కొడిగుడ్లు, సారాయి తదితర >>2



పూడూరు మండలం కద్మూరులో శివాలయం చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు చేయిస్తున్న రైతులు



కొడంగల్‌లో ఊరేగింపు సందర్భంగా చిన్నారుల సందడి

# గ్రామసభలో రైతు కన్నీరు!

**అభివృద్ధి పనులకు వ్యతిరేకం కాదు**

**జీవనాధారమైన భూములు పోతే ఎలా?**

**సరైన నష్టపరిహారం అందించేలా ఉపాధికి భరోసా ఇవ్వండి**

**ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియపై అభిప్రాయ సేకరణ**

**కొడంగల్ పరిసర గ్రామాల రైతులు ఆవేదన**

**భూముల సర్వే సక్రమంగా జరగలేదని నిరసన**



2లో

ఉన్న నాలుగెకరాల భూమి పూర్తిగా పోయిందని గ్రామసభలో కన్నీటి పర్యంతమైన రైతు సంజీవ్

## రైతు భరోసా ఒకే విడతలో జమ చేయాలి

**రైతు సంఘం నాయకుల డిమాండ్**

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఒకేసారి (ఒకే విడతలో) రైతు భరోసాను రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతాంగం ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించాలని రైతు భరోసాను ఒకేసారి అందరికి వేయాలని తెలంగాణ రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు తెలంగాణ రైతు సంఘం నాయకులు విచ్చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ముందుగా జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి ప్రభుత్వం రైతులందరికి ఒకే విడతలో రైతు భరోసాను జమ చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రైతు భరోసాను ఒకేసారి >>2



ప్రజావాణికి తరలివచ్చిన దరఖాస్తుదారులతో సందడిగా మారిన కలెక్టరేట్ ప్రాంగణం

# ప్రజావాణి కిటకిట

**బారులు తీరిన దరఖాస్తుదారులు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 29, ప్రభాతవార్త :** కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా తమ సమస్యలను అధికారులకు విన్నవించుకోవటానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కలెక్టరేట్ ప్రజావాణి ప్రాంగణం దరఖాస్తుల నమోదు సెంటర్ వద్ద బారులు తీరి నిరీక్షించారు. కలెక్టరేట్ ప్రాంగణం అంతా కూడ ప్రజావాణి జరిగిన సమయంలో దరఖాస్తుదారులతో నిండిపోయింది. జిల్లాకు చెందిన ప్రజలు ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి అర్జీలను అందజేసి సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 95 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజావాణిలో డిఆర్‌ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్యలు పరిష్కరిస్తారని కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో అర్జీలుఇ ఇవ్వటానికి వస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండ ధరఖాస్తులను వెంటనే పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం చేయకుండా చూడాలన్నారు. దరఖాస్తులను తిరస్కరిస్తే వాటికి గల కారణాలను >>2

# నాలాకు తాళం!

**చదును చేసి, గేటు పెట్టి రాకపోకలు అడ్డుకున్న కబ్జాకోరులు**

**హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల సందడిలో సడేమియా..**

**మొయినాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలో భూముల ధరలు కోట్ల రూపాయలకు చేరుకోవడంతో కబ్జాదారుల కన్ను ఇప్పుడు వాగులు, వంకలు, నాళాలపై పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి అనే తేడా లేకుండా జలమార్గాలను సైతం ఆక్రమిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 510లో ప్రారంభమయ్యే నాలా 486, 487, 488, 491, 492 >>2



నాలాను కబ్జా చేసిన దృశ్యం

# యువత భవిష్యత్తు విషయంలో రాజీపడబోం

**మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే వారికి గుణపాఠం చెప్పాలి**

**బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్**

విబిఐటిలో మొక్క నాటి.. నీరు పోస్తున్న నితిన్‌నబీన్, రాంచందర్‌రావు

2లో





పెద్దేముల్‌లో ఎడ్లను అలంకరించి తీసుకువస్తున్న స్థానిక రైతు పెద్దలు



కొడంగల్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## ఏరువాక సాగాలో...రన్న

(మొదటి పేజీ తరువాయి)

వాటిని ఎద్దులకు తాగించారు. మధ్యాహ్నం వేళల్లో ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచభక్ష్యాలతో ప్రత్యేకంగా వండిన ఆహారాన్ని తినిపించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ఎడ్లను తిప్పి అమ్మవారికి ప్రార్థనలు చేశారు. తమను చల్లగా చూడాలనీ, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురువు పంటలు బాగా పండేలా ఆశీర్వదించాలని కోరుతూ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళల్లో ఆనవాయితీ ప్రకారం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి దేశ్‌ముఖ్‌ల కెందిన ఎద్దులకు ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించి గ్రామ పెద్దలు, రైతులు, ప్రజల సమక్షంలో వధ్యంలో ప్రధాన వీధిగుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తనయుడు మాజీ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పట్టణ రైతులు పాల్గొన్నారు.

కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్, హస్నాబాద్, రావులపల్లి,రుద్రారం, అంగడిరైచూర్, అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, చిట్లపల్లి,లక్ష్మీపల్లి, పెద నందిగామ, చిన్ననందిగామ, హస్నేనీపూర్, కస్తూర్‌పల్లి, ఇందనూర్ తదితర గ్రామాల్లో రైతులు ఘనంగా జరుపుకున్నారు. కాడెద్దులకు రంగురంగుల బాసింగాలు, దుస్తులతో ప్రత్యేక అలంకరణలతో డప్పులు,వాయిద్యాలు,రైతుల నృత్యాల మధ్య గ్రామాల్లో ఊరేగిస్తు గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు.

## ప్రజావాణి కిటకిట

(మొదటి పేజీ తరువాయి)

తప్పనిసరిగా అర్జీదారులకు తెలియజేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అయితే ఈ ప్రజావాణిలో ఎక్కువగా డిఆర్‌డిఎ శాఖకు సంబంధించి 20దరఖాస్తులు అందాయి. వీటిలో ఎక్కువగా పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తరువాత ఈ సెక్షన్‌కు సంబంధించి భూ సమస్యలపై దరఖాస్తులు 15 అందినట్లు, ఆ తరువాత పిడి హౌజింగ్‌కు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం 8మంది దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. డిఇఓకు సంబంధించి 7 దరఖాస్తులు, ఫిర్యాదులు అందినట్లు, మిగతా వివిధ శాఖలకు సంబంధించిన ధరఖాస్తులను ప్రజలు ప్రజావాణిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఒకే విడతలో జమ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఒకే విడతలో రైతు భరోసా ఇవ్వాలని, పంటల భీమా పథకం అమలు చేయాలని, యూరియా వంటి ఎరువుల అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువుల ధరలను తగ్గించాలని, రాష్ట్ర స్థాయి పంట భీమా పథకం అమలు చేయాలన్నారు. ఇన్‌పుట్ ఖర్చులు రైతులకు పెరగటం వల్ల రైతులకు భారంగా మారిందని, ఏదు రకాల ఎరువుల ధరలను తగ్గించాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల భారం నుంచి రైతాంగాన్ని ఉపశమనం కల్పించాలన్నారు. యూరియా సరఫరాను పారదర్శకంగా, అవసరానికి సరిపడా అందించాలని కోరారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించినట్లు, ఆ తరువాత జిల్లా వ్యవసాయ అధికారి కె.చంద్రశకరను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.జంగయ్య, కార్యదర్శి నిమ్మల నర్సింహ్మా, కోశాధికారి పి.చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు బి.రాజురెడ్డి, ఎం.కొండయ్య, పలువురు పాల్గొన్నారు.

# కొలతల్లో కత్తెర!

### రంగారెడ్డి బంకుల్లో ఘరానా మోసం

### కాగితాలకే పరిమితమవుతున్న నిబంధనలు

### మామూళ్ల మత్తులో అధికారులు..

### దాడుల సమాచారం ముందే లీక్!

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రస్తుత రోజుల్లో ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ పెట్రోల్, డీజిల్ నిత్యావసరాలుగా మారాయి. వాహనాల సంఖ్య పెరగడంతో ఇంధన వినియోగం కూడా రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది. వినియోగదారులకున్న ఈ అత్యవసర అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు పెట్రోల్ బంక్ డీలర్లు, యజమానులు అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు. తూనికలు, కొలతల అధికారుల లెక్కల ప్రకారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 500లకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి.

ఇందులో హైదరాబాద్ పరిధిలో 178 బంకులు ఉండగా, రంగారెడ్డి పరిధిలో దాదాపు 330 వరకు ఉన్నాయి. ఈ బంకుల్లో చాలావరకు మీటర్లను ట్యాంపరింగ్ చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఇటీవల కాలంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ పరిధిలోని అనేక పెట్రోల్ బంకులు కనీస వసతులు, కొలమానాలు లేకుండానే నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం... వినియోగదారుడికి ఇంధనం కల్తీ జరిగినట్లు అనుమానం వచ్చినా లేదా తక్కువ కొట్టినట్లు అనిపించినా స్వయంగా తనిఖీ చేసుకునేందుకు వీలుగా ప్రతి బంకులోనూ ఫిల్టర్ టెస్ట్ పేపర్, డెన్సిటీ హైడ్రోమీటర్‌తోపాటు 5 లీటర్ల కొలమానం అందుబాటులో ఉంచాలి. ఏ వినియోగదారుడు అడిగినా వీటిని తప్పనిసరిగా అందజేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో ఎక్కడా ఈ పరికరాలు అందుబాటులో ఉంచడం లేదు. ఒకవేళ ఎవరైనా వినియోగదారుడు ధైర్యం చేసి వాటిని అడిగితే, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

అరునెల క్రితం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఎనిమిది పెట్రోల బంకుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఐదు లీటర్ల పెట్రోల్‌కు 25ఎంఎల్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

అదే రోజు హైదరాబాద్ పరిధిలోని 10 పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించగా.. ఎలాంటి కేసు నమోదు కాలేదు. దీంతో పలువురు వినియోగదారులు కేసులు నమోదు కాకపోడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల నిర్వాహకుల సమాచారాన్ని ముందుగా చేరవేడయం వల్లే ఎలాంటి కేసులు నమోదు కాలేదని అరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దాడులకు బయలుదేరేముందు నిర్వాహకులకు సమాచారాన్ని చేరవేయడంగానీ, క్రింది స్థాయి సిబ్బంది ద్వారా కానీ సమాచారం వెల్లడంతో బంక్‌ల నిర్వాహకులు మీటర్లను సెట్ చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అవసరమున్నపుడే దాడులు నిర్వహించి వారిని నుంచి లంచాలు వసూలు చేసుకుని ఆతర్వాత చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# యాసంగి ఆశలు



(మొదటి పేజీ తరువాయి)

నుంచి ప్రవహించే మూసీ, ఈసీ నదుల జలాలు ఉస్మాన్సాగర్, హిమాయత్సాగర్ ప్రాజెక్టులకు చేరుతుంటాయి. హైదరాబాదకు మంచినీటిని అందించే పెద్ద వనరులు కావడం వల్ల నిజాం హయాం నుంచే నిబంధనలు అమలులో ఉన్నాయి. దానివల్ల భారీ ప్రాజెక్టులు సాధ్యం కాలేదు. 111 జీవో ప్రకారం పలుచోట్ల జల వనరుల నిర్మాణం జిపిఎ చేపట్టడం లేదు.

**ఉమ్మడి జిల్లాలో 8 ప్రాజెక్టుల నిర్మాణం**

అందువల్ల వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాలలో ఎనిమిది మధ్య, చిన్న తరహా ప్రాజెక్టులను నిర్మించారు. అందులో కోటపల్లి (పెద్దేముల్గారూరు), లక్నాపూర్ (పరిగి), సాలార్నగర్ (గండ్వీడు), జుంటుపల్లి (యాలాల), నందివాగు (మొమిన్పేట), కొంశెట్టిపల్లి (మర్పల్లి), అల్లాపూర్ (తాండూరు), జినుగుర్తి (తాండూరు) ప్రాజెక్టులు కట్టారు. యాలాల వద్ద శివసాగర్ ప్రాజెక్టు 20 ఏళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్నది.

**కాగితాలకే పరిమితమైన ఆయకట్టు**

కోటపల్లి ప్రాజెక్టును అప్పట్లో 24 అడుగుల నీటి నిల్వ సామర్థంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద 9,200 ఎకరాల ఆయకట్టు భూములకు నీరు అందించే సామర్థం ఉంది. కుడి, ఎడమ, బేబీ కాల్వలు, ప్రధాన కట్ట, అలుగు కట్టించారు. కుడి కాల్వ ద్వారా 8,100 ఎకరాలు, మిగిలిన రెండు కాల్వల ద్వారా 1100 ఎకరాలకు నీరందిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నా వాస్తవానికి 6 వేల ఎకరాలు కూడా తడపడం లేదు. ఆరంభంలో నిర్మించిన కాల్వలు చాలా వరకు దుస్థితికి చేరాయి. కనీసం ఆనవాళ్లు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. పాలకులు దీని ఆధునికీకరణ విస్మరించారు. 2003లో వైయస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర సందర్భంగా ఆధునికీకరణకు నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. పైగా 1967లో కోటపల్లి ప్రాజెక్టు కాంట్రాక్టు పనులు తామే చేపట్టినట్లు గుర్తు చేశారు. వైయస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనుకున్నంత నిధులు విడుదల కాలేదు.

**రైతాంగంలో హర్షాతిరేకాలు**

15 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అంచనాలు రూపొందించిన వాస్తవ రూపం దాల్చేందుకు ఇంతకాలం పట్టింది. ప్రస్తుత పనుల పట్ల రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది. ఇకపై పునాస, యాసంగి పంటలు పండించవచ్చని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# కొడంగల్ గ్రామ సభలో రైతు కన్నీరు






గ్రామ సభకు హాజరైన రైతులు, మాట్లాడుతున్న అధికారులు

**కొడంగల్, జూన్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ ప్రక్రియలో భాగంగా సోమవారం కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు తాండూర్ ఆర్డీఓ అనిత ముఖ్య అతిగా హాజరైయ్యారు. ఎత్తిపోతల పథకంలో భూముల కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. ఈ కార్యక్రమానికి సంభందించి భూసేకరణ ప్రభావిత ఆమాల రైతులు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను అధికారులు దృష్టికి తీసుకు వచ్చారు. కొడంగల్ మున్సిపల్ పరిధితో పాటు మండల పరిధిలోని ప్యాలమద్ది, పెద్దనందిగామ గ్రామాలతో పాటు దౌల్తాబాద్ మండలంలోని నీటూర్, మాటూర్, దౌల్తాబాద్ తదితర గ్రామాల పరిధిలో 17.8 కిలోమీ టర్ల మేర భూసేకరణ చేపట్టినున్నట్లు అధికారులు వెల్లడించారు. భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూసేకరణ వల్ల కలిగే ప్రభావాలు, నష్టపరిహారం, పునరావాసం తదితర అంశాలపై రైతులతో చర్చించారు.

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో కొడంగల్ పట్టణానికి చెందిన రైతు సంజీవ్ కన్నీంటి పర్యంతమైయ్యారు. తనకు ఉన్న నాలుగు ఎకరాల భూమి పూర్తిగా భూసేకరణలో పోతుందని అధికారుల ఎదుట బోరున విలపించారు. తమ కుటుంబానికి ఆ భూమే జీవనాధారమంటూ గోడు వెల్లబోసుకున్నాడు. రైతు ఆవేదనతో అధికారులు అవాక్కైయ్యారు.

దీంతో పలువురు రైతులు ఆయనకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. తమ పంట పొలాల్లో సర్వే నిర్వహించే సమయంలో సంభందిత అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వలేదంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల సర్వే పారదర్శకంగా జరుగలేదని, భూసేకరణకు సంభందించి సమగ్ర వివరాలను ముందుగానే తెలియ జేయాలని కోరారు. ప్రభుత్వం చెపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, తమ జీవనాధారమైన భూములను కోల్పోతున్న నేపథ్యంలో సరైన నష్టపరిహారం అందిస్తు ఉపాధి భరోసా కల్పించాలని అధికారులను కోరారు. అనంతరం ఆర్డీఓ అనిత మాట్లాడుతూ భూసేకరణకు సంభందించి రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రైతుల అభ్యంతరాలు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి నిభంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా భూ సేకరణ గ్రామసభ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీగా పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్‌నాయక్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తు విషయంలో రాజీపడబోం

### బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** భారతదేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే సత్తా యువతకు ఉందని, తెలంగాణ యువతలో అద్భుతమైన ప్రతిభ, సృజనాత్మక, అపారమైన సామర్థ్యం ఉన్నాయని బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్ అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని విజ్ఞానభారతీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బిజెవైఎం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్ నిర్వహించారు. ఈసందర్భంగా బిజెవైఎం కార్యకర్తలు, విద్యార్థులు నితిన్‌నబీన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ఆవరణలో జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్, రాష్ట్రశాఖ అధ్యక్షులు ఎన్.రాం చందర్‌రావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌లు మొక్కలు నాటి నీరు పోశారు. అడిటోరియమ్‌లో జరిగిన యువ సమ్మేళనంలో నితిన్‌నబీన్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులుచ యువతతో ఆయన ముచ్చటించారు. రాజకీయ, వర్తమాన అంశాలపై వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలను వివరంగా తెలియజేసి నివృతి చేశారు. దీర్ఘకాలిక ప్రణాళికతో చేపట్టిన లక్ష్యాలను సాధించుకోవడానికి నిర్ణయాత్మక విధానం అవపసరమని ఆయన సూచించారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ యువత భవిష్యత్తులో రాజీపడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ నిర్మాణమే ధ్యేయంగా దేశ యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుందని ఆయన తెలిపారు.ఉపాధి, అభివృద్ధి విషయంలో యువతకు ఇచ్చిన ప్రధానహామీలను నెరవేర్చడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యువత, విద్యార్థులను వంచించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగభృతి అంటూ ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. నేటి తరం యువత చాలా చైతన్యవంతమైందని, ప్రతి విషయాలన్ని గమనిస్తూ ప్రశ్నిస్తుందని, మోసపూరిత రాజకీయాలు చేసే వారికి ప్రజలు సరైన సమయంలో తప్పకుండా గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. నేటి ఏఐతో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడినా కొత్త పరిశ్రమల స్థాపనకు, ఉద్యోగ కల్పనకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి




విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్‌లో మాట్లాడుతున్న నితిన్‌నబీన్

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసకోవద్దని డ్రగ్స్ సంస్కృతి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. బిజెపి దేశభక్తి, జాతీయభావం పెంపొదించేందుకు యువతను వివిధ అంశాలలో ముందుకు తీసుకువెళ్తుందన్నారు.

తెలంగాణలో డబుల్‌ఇంజిన్ సర్కారు వచ్చి యువత, విద్యార్థుల సమస్యలను తీర్చుందన్నారు. భూత, వర్తమాన, భవిష్యత్తు పరిమాణాలకు అనుగుణంగా యువత తమ జీవిత లక్ష్యాలను పొందాలని నితిన్ సూచించారు. ఈకార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.ఆరుణ, రాజ్యసభసభ్యురాలు రేఖాశర్మ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ తెలంగాణ ఇంచార్జ్ అభయ్‌పాటిల్, మహారాష్ట్ర ఐటీశాఖ మంత్రి అశీష్‌శెలర్, రాష్ట్రశాఖ ప్రధానకార్యదర్శులు ఎన్.గౌతంరావు, జి.మనోహార్‌రెడ్డి, చంద్రశేఖర్‌జీ (సంస్థాగత), అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుందె గణేశ్, బిజెపి మేడ్చల్ రూరల్ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు పవన్‌రెడ్డి, పలువురు రాష్ట్ర, జిల్లాల యువమోర్చ నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి బాలికల హాస్టల్‌లో కలకలం

**తాండూరు, జూన్ 29, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తి గ్రామ శివారులో ఉన్న గిరిజన బాలికల వసతి గృహంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘటన కలకలం రేపింది. వసతి గృహంలో ఉంటూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మహేశ్వరి హాస్టల్ భవనం పైనుంచి దూకింది. ఈ ఘటనలో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలై ఎముకలు విరగడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అయితే, విద్యార్థిని భవనంపై నుంచి ఎందుకు దూకింది అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కుటుంబ సమస్యల కారణంగానా.. లేక ఇతర వ్యక్తి గత, విద్యా సంబంధిత కారణాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. ఘటనపై సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు హాస్టల్‌ను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థినితో పాటు హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థుల నుంచి కూడా వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# నాలాకు తాళం

(మొదటి పేజీ తరువాయి)

సర్వే నంబర్ల గుండా ప్రవహిస్తూ షాపూర్ రెవెన్యూలోకి చేరి చివరకు గండిపేట చెరువులో కలుస్తుంది. ఈ నాలా ద్వారా వర్షపు నీరు చెరువుకు చేరుతుంది. ఇటీవల హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇదే అదనుగా భావించిన కొందరు కబ్జాదారులు కనకమామిడి రెవెన్యూ పరిధిలోని 488. 487 సర్వే నంబర్ల వద్ద జేసీబీలు, హిటాచీలతో నాలాను పూర్తిగా పూడ్చివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గత డిసెంబర్‌లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, కేవలం నామమాత్రపు విచారణ చేసి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు.అంతేకాకుండా, బీజాపూర్- హైదరాబాద్ రహదారికి ఆనుకొని ఉన్న నాలాను హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి, ఆ స్థలాన్ని చదును చేసి గేటు ఏర్పాటు చేసి తాళం వేశారు గత వారం రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో నాలా లేకపోవడంతో వర్షపు నీరు చేవెళ్ల ప్రధాన రహదారికి ఇరువైపులా నిలిచి పోయింది. ప్రతిరోజూ ఆ మార్గంలో ప్రయాణించే వారికి ఈ ఆక్రమణ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పట్టించు కోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ భూములు, వాగులు, వంకలను పరోక్షంగా ఆక్రమింపజేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని నేరుగా విక్రయించలేని పరిస్థితుల్లో కబ్జాదారులకు అధికారులు సూచనలు ఇస్తూ, వారి చేతికి మట్టి అంటకుండా ప్రభుత్వ ఆస్తులు కొల్లగొట్టే పరిస్థితి నెలకొందని విమర్శిస్తున్నారు.

**ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు : తహసీల్దార్**

నాలాల జోలికి వస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు ప్రభుత్వ భూములను గాని నాలాలు గాని కబ్జా చేస్తే వారిపై చట్టపరివైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఐదు నెలల క్రితం కనక మామిడి రెవెన్యూ పరిధిలోని 510 సర్వే నంబర్లు ప్రారంభం అవుతున్న నాలా వర్షపు 488 487 492 496లో నుండి షాపూర్ రెవెన్యూలోకి ప్రవేశించే నాలను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారన్న విషయం తెలుసుకొని వాటిని అడ్డుకున్నాం. అదే నాలాను ఇప్పుడు మళ్లీ పూడ్చి అక్రమకబ్జా చేశారని తెలిసింది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నాలాను స్వాధీనం చేసుకుంటాం.

**అంత గేటు పెడితే అధికారులకు కనిపించడం లేదా?**

**మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్ రెడ్డి**

నిరుపేదలు లేదా రైతులు ప్రభుత్వ భూమిలో చిన్న గుడిసె వేసినా, దారి చేసుకున్నా అధికారులు వెంటనే వెళ్లి భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేస్తారు. కానీ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నాలాను పూర్తిగా ఆక్రమించి గేటు ఏర్పాటు చేసినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు కనిపించడం లేదా? ఈ వ్యవహారంపై మాకు తీవ్ర అనుమానాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన నాలాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.



ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ పనులు చేపడుతున్న దృశ్యం

### ఉప్పల్ స్కైవాక్ సాక్షికంగా

# మూసివేత..

### శరవేగంగా ఎలివేటెడ్ కారిడార్ పనులు

### ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడేనా?

### ట్రాఫిక్ కష్టాల్లో స్థానికులు..

**ఉప్పల్, జూన్ 29 ప్రభాతవార్త:** ఉప్పల్ రూట్‌లో ప్రయాణించే వాహనదారులకు, స్థానికులకు త్వరలోనే ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి లభించనుంది. ఉప్పల్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. 2018లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే, గతంలో కాంట్రాక్టర్ నిరక్ష ్యం, భూసేకరణ సమస్యలు, కోర్టు కేసులు మరియు ఇతర సాంకేతిక కారణాల వల్ల ఈ పనులు గత ఎనిమిది సంవత్సరాలుగా సాగుతూ నత్తనడకన సాగాయి. ఇటీవల రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని పలుమార్లు సందర్శించి, పనులను పర్యవేక్షి ంచడమే కాకుండా రాబోయే దసరా నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 625 కోట్ల అంచనా వ్యయం.. 6 లైన్ల రహదారిసుమారు 6.2 కిలోమీటర్ల పరిధిలో, రూ. 625 కోట్ల అంచనా వ్యయంతో ఆర్‌అండ్‌బి అధికారులు ఈ పనులను చేపట్టారు. 45 మీటర్ల వెడల్పుతో ఆరు లైన్ల రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మొదటి విడతగా నారపల్లి నుంచి ఉప్పల్ వరకు పనులు జరగ్గా.. అక్కడి నుంచి డీఎస్‌ఎల్ మాల్ వరకు మరో రూ. 350 కోట్లతో ఎంఎంసి అధికారులు కారిడార్ పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఉప్పల్ రింగ్ రోడ్డులోని వరంగల్ జాతీయ రహదారిని మూసివేసి, చౌరస్తాలో పిల్లర్ల నిర్మాణం చేపట్టారు. గత నెల రోజులుగా జరుగుతున్న ఈ నిర్మాణ పనుల వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఈ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ల నిర్మాణం కోసం ఉప్పల్ స్కైవాక్ వరంగల్ వైపు ఉన్న దారిలో కొంత భాగాన్ని తాత్కాలికంగా తొలగించనున్నారు. అయితే స్కైవాక్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, రెండు వైపులా ప్రత్యామ్నాయ దారి నిర్మించి ఈ పిల్లర్ల పనులు చేపడుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. స్కైవాక్‌కు ఉన్న మిగతా మూడు వైపులా రాకపోకలు యథావిధిగా సాగుతాయని, కేవలం ఒక వైపు మాత్రమే కొద్దిరోజుల పాటు మూసివేస్తామని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. పిల్లర్ నిర్మాణం పూర్తి కాగానే దీనిని తిరిగి పునరుద్ధరిస్తారు. రెండు నెలల్లో పిల్లర్ల పనులు పూర్తిఉప్పల్ చౌరస్తాలో జరుగుతున్న ఈ కారిడార్ నిర్మాణాన్ని మరో రెండు నెలల్లోగా పూర్తి చేస్తామని ఎంఎంసి అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ప్రతిరోజూ ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షి స్తున్నారు. ఎనిమిదేళ్లుగా సాగుతున్న ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు ముగింపు దశకు చేరుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మాల్స్, లాడ్జిలకు నోటీసులు ..మహిళల భద్రతకు పోలీసుల ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఉన్న వందకుపైగా షాపింగ్ మాల్స్, లాడ్జిలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. మాల్స్ లాడ్జిల్లో హిడెన్ కెమెరాల నివారణకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. షాపింగ్ మాల్స్, లాడ్జిల్లో.. హిడెన్ కెమెరాలు, స్పై కెమె రాలు ఏర్పాటు చేసి.. అక్కడికి వచ్చే కస్టమర్ల ప్రైవేటు వీడియోలను తీసి.. వాటిని సోషల్ మీడియాలో, పోర్న్ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసే కొం తమం ది దుర్మార్గుల వ్యవహారం ఇప్పటివరకు చాలాసార్లు బయటపడ్డాయి. ఇలాం టి ఘటనలతో మహిళలు.. మాల్స్‌లోని ట్రయల్ రూమ్, లాడ్జిల్లోకి వెళ్లేందు కు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో మహిళల భద్రత, వారికి భరోసాను కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ట్రయల్ రూమ్స్, రెస్ట్ రూమ్స్‌లో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతీ మాల్‌లో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్‌ను నియమించాల ని, హిడెన్ కెమెరాలను గుర్తించే డిటెక్షన్ డివైస్‌లను ఉపయో గించాలని సూ చించారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి రికార్డులను మెయిం టెయిన్ చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద డివైజ్‌లు కనిపిస్తే వెంటనే తమకు చెప్పాలని షాపింగ్ మాల్స్, లాడ్జిల యజమానులకు కీలక ఆదేశాలి చ్చారు. ఈ క్రమంలోనే హిడెన్ కెమెరాలను గుర్తించేందుకు డిటెక్షన్ డివైస్‌లను కూడా ఉపయోగించాలని పేర్కొన్నారు.



## మక్తమాదారంరోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలి

.. ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతల వినతి

**కల్వకుర్తి, జూన్ 29, ప్రభాత వార్త :** కల్వకుర్తి మండలం మక్త మాదారం నుంచి కందుకూరు మండలం నేదునూర్‌వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలని కోరుతూ సోమ వారం మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డితో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ రోడ్డు విస్తరణతో తలకొండపల్లి , మిడ్జిల్ మండలాల ప్రజలకు హైదరాబాద్‌కు వెళ్లే దూరం, సమయం తగ్గి ఇంధనం ఆదా అవుతుందని, ఇరుకు రోడ్డు వల్ల జరుగుతున్న ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు తగ్గుతాయని, చుట్టుపక్కల గ్రామాల్లో రియల్ ఎస్టేట్, వ్యాపార, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందుతాయని నేతలు వివరించారు. దీనిని ప్రాధాన్యతగా తీసుకొని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరగా, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి అధికారులతో చర్చించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

సర్పంచ్ రవీందర్ నాయక్



ఉచిత కందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల, జూన్ 29, ప్రభాతవార్త:** రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెరువు ముందలి తాండ (ఎ) సర్పంచ్ రవీందర్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయవిస్తరణ అధికారి అనితతో కలిసి రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమాలు అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకండి

..సర్పంచ్ సి.బాల్‌రాజ్

**పెద్దేముల్, జూన్ 29, ప్రభాతవార్త:** అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ చెరుకుపల్లి బాల్‌రాజ్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామంలో నిర్వహించిన సర్ ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాల్‌రాజ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో కొనసాగడం అత్యంత ముఖ్యమని అన్నారు. గ్రామంలోని ప్రతి ఓటరికి సరైన సమాచారం అందాలని, పత్రాల సమర్పణ, ధృవీకరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని అన్నారు. ఎవరికి అన్యాయం జరగకుండా అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకొని పనిచేయాలని అన్నారు. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడు తన పేరును ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంకట చైతన్య, నాయకులు మహేష్, వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**పెద్దేముల్, జూన్ 29, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం మారెపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రత్యేక అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు బోధించేందుకు (గెస్ట్ లెక్చరర్ )ఎంపిహెచ్‌డబ్లు మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు కావాలని, విద్యార్హతలు బిఎస్‌సి నర్సింగ్, ఎంఎస్సి నర్సింగ్ చేసి ఉండాలని తెలిపారు. అదే విధంగా ఎకనామిక్స్ సబ్జెక్ట్ భోదించేందుకు గెస్ట్ లెక్చరర్ కావాలని, విద్యార్హతలు ఎంఎ ఎకనామిక్ ఆంగ్లంలో చేసి ఉండాలని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జులై 3వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన ఎబివిపి నాయకులు



కార్తీక్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన ఎబివిపి నాయకులు

-పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కార్తీక్ రెడ్డి

**శంషాబాద్, జూన్ 29,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లొల్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో శంషాబాద్ 119వ డివిజన్ అధ్యక్షులు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎబివిపి చెందిన పలువురు విద్యార్థిసంఘం నాయకులు సోమవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

మనీష్ ముదిరాజ్ (ఏబీవీపీ ఎస్ఎఫ్‌డి-స్టేట్ కోఆర్డినేటర్), అమీర్ పేట చరణ్ దీప్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్, శివవిభాగ్ ఫారమెడికల్ కన్వీనర్ ,శ్యామ్‌టౌన్ జాయింట్ సెక్రటరీ, జై కుమార్‌టౌన్ వైస్ ప్రెసిడెంట్, సందీప్ టౌన్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ లు బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పట్లొల్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం , విద్యార్థుల సమస్యల పరిష్కారం మరియు ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని అన్నారు.

పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

పార్టీలో చేరిన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే పట్లొల్ల కార్తీక్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతోనే తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 118 , 119 డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసింహ, పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి పరందాములు , బైరమోని మల్లేష్, చరణ్, కృష్ణ రెడ్డి, రాచమల్ల రమేష్, మురళి గౌడ్, మంచర్ల హరికృష్ణ, మాడపాటి నరేందర్, యూత్ అధ్యక్షులు బిజు పవిత్ర సాగర్, శివ గౌడ్ , దీపక్ గౌడ్ , బీఆర్ఎస్ పార్టీ, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు మరియు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ



స్టోర్ రూమ్ పరిశీలిస్తున్న అధికారులు

**ధారూర్, జూన్ 29, ప్రభాత వార్త:** ధారూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అధికారుల బృందం సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, వారి విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన అధికారులు, వంటల నాణ్యతను, రుచిని పరీక్షించారు. అలాగే, పాఠశాలలో బియ్యం, కూరగాయల నిల్వ విధానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వంటశాల పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని అధికారుల బృందం ఆదేశించింది. విద్యార్థినులు అనారోగ్యానికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని, వారికి వ్యక్తిగత పరిశుభ్రతపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు ఉపాధ్యాయులు అన్ని విధాలుగా అండగా నిలవాలని, వారిని చదువుపై శ్రద్ధ చూపేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింలు, ఎంఇఒ చెన్నయ్య పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజస్థంభ, విగ్రహ ప్రతిష్ఠ

పాల్గొన్న హర్యానా మాజి గవర్నర్ దత్తాత్రేయ

**కుల్కచర్ల, జూన్ 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఘణపూర్ గ్రామంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. పిఎన్‌పిఎస్ వ్యవస్థపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివరామ దుర్గ ఆలయంలో శివలింగం, దుర్గాదేవి, సితారామ లక్ష్మణ, ఆంజనేయ, దత్తాత్రేయ, విగ్రహ మరియు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారంలో ముగిశాయి. వేదమంత్రాలు, మేళతాళలు, భక్తుల కోలాహలం మధ్య నూతన ధ్వజ స్తంభ స్థాపన చేశారు. వేదపండితులు శ్రీ శివనంద గురు స్వామిహోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. పూర్ణాహుతి, శాంతికాళ్యాణం అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠకు హర్యానా మాజి గవర్నర్ దత్తాత్రేయ, చెవేళ ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు కరణం ప్రహ్లాద్ రావు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భింరెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటయ్య గౌడ్, ఘణపూర్ సర్పంచ్ రవీందర్ నాయక్, కుల్కచర్ల సర్పంచ్ ఆంజిలయ్య, అయా గ్రామాల భక్తులు, నేతలు, పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ పాల్గొన్న హర్యానా మాజి గవర్నర్ దత్తాత్రేయ

# పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

..అధ్యాత్మికత, అభివృద్ధి రెండు సమాంతరంగా సాగాలి

..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, జూన్ 29, ప్రభాతవార్త:** పార్టీకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని, అద్యాత్మికత, అభివృద్ధి రెండు సమాంతరంగా సాగాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు మండలం నారాయణ్‌పూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయ నూతన చైర్మెన్ ఉప్పరి కుమార్, పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాలు గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా సామాజిక ఐక్యతకు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని అన్నారు. గ్రామంలో మౌళిక వసతులతో పాటు దేవస్థానాల అభివృద్దికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామాన్ని ఆధ్యాత్మికంగా, సామాజికంగా అభివృద్ధి దిశగా తీర్చి దిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. అనంతరం సర్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారుల ద్వారా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో భాగంగా గ్రామంలోని బూత్‌నెంబర్ 100, 101లలో ఎమ్మెల్యే స్వయంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మెన్ పట్లొల్ల నర్సిములు, సర్ నియోజకవర్గ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు, సర్పంచ్ అమృతమ్మ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, డిసిసిబి మాజీ చైర్మెన్ రవిగౌడ్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

# ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూలస్థంభం

**కేశంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**

ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వాల రూపంలో ప్రతిబింబించే శక్తి ఓటుకు ద్వారా మాత్రమే ఉంది అని కేశంపేట మండల సర్ ప్రోగ్రామ్ ఇంచార్జ్‌లు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షులు అనుమగల్ల రమేష్, మాజీ అధ్యక్షులు గూడ విరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా కోనాయిపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. సర్ కార్యక్రమం కేవలం కొత్త ఓటర్ల నమోదు కోసమే కాకుండా, ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు చేపట్టిన కీలక కార్యక్రమమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకే వ్యక్తి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే వాటిని సవరించడం, చిరునామా మార్పులు, పేర్లలో పొరపాట్లు, ఫోటోలు, కుటుంబ వివరాలను సరిచేయడం ద్వారా ఓటరు జాబితాను మరింత విశ్వసనీయంగా రూపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, ఉద్యోగాలు, చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వంటి కారణాలతో చాలామంది యువత ఇప్పటికీ ఓటరుగా నమోదు కాలేకపోతున్నారని, అలాంటి ప్రతి ఒక్కరిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడం ప్రతి ప్రజాప్రతినిధి, రాజకీయ కార్యకర్త, చైతన్యవంతుడి బాధ్యత అని అన్నారు. "ఒక ఓటు ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలదు.. ఒక ఓటు అభివృద్ధి దిశను మార్చగలదు.. ఒక ఓటు ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేయగలదు" అని పేర్కొంటూ, అర్హులైన వారందరూ అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఓటు హక్కును కాపాడుకోవడం ద్వారా రాజ్యాంగ విలువలను నిలబెట్టుకుందామని, ప్రతి ఇంటికి ఎస్ఐఆర్ సందేశాన్ని తీసుకెళ్లి ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు నర్సింహ రెడ్డి, గ్యార సురేష్, చొప్పరి సత్యం, బర్కం జంగయ్య, మాధవ రెడ్డి, బద్రు నాయక్, రంగు శ్రీనివాస్, యు. రాజశేఖర్, యాదయ్య, రుక్మద్దీన్, బాలరాజ్, రాములు, రామచంద్రి, అర్జున్, నరసింహ, చంద్రశేఖర్, ఎస్. రాజశేఖర్, పెంటయ్య, శేఖర్ రెడ్డి, నరసింహ బ్రహ్మచారి, కృష్ణయ్య, మల్ రెడ్డి వెంకటయ్య, బుచ్చయ్య, లలిత, జంగమ్మ, రాములమ్మ, లలిత, ప్రవీణ, లక్ష్మీదేవి తదితరులు



కోనాయిపల్లిలో ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్ ప్రోగ్రామ్ ఇంచార్జీలు ,నాయకులు,



ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**కేశంపేట, జూన్ 29, ప్రభాతవార్త:**

ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఓటు హక్కు అర్హులైన ప్రతి ఒక్కరికి రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. ఆ హక్కును ఏ కారణం చేతనైనా దూరం చేసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రాజకీయ పక్షపాతం లేకుండా సవరణ ప్రక్రియ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, వార్డు, బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని కోరారు. పేరు లేకపోయినా లేదా వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సరిదిద్దుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

## పెట్రోలు పోసుకొని వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం...

**యాచారం, జూన్29, ప్రభాతవార్త:**

మండల పరిధిలో చింతపట్ల గ్రామానికి చెందిన గుండ్ల మల్లమ్మ (75)సుమారు మధ్యాహ్నం 2:00 గంటలకు పెట్రోలు పోసుకొని వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం సంఘటన చోటు చేసుకుంది. సోమవారం యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. వృద్ధురాలు గుండ్ల మల్లమ్మ కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నది. సుమారు 6 నెలల ముందు తన భర్త చనిపోవడం, పక్షవాతంతో, మనస్థాపంతో బాధ పడుతూ ఉండేది. తన జీవితం మీద నిరాశ చెంది పెట్రోలు తెచ్చుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చుట్టుప్రక్కల పెండ్యాల యాదయ్య, మేస్త్రీ పని ముగించుకొని ఇంటికి వస్తుండగా, అక్కడ వృద్ధురాలు మల్లమ్మ కేకలు వేయడంతో హుటాహుటిన సంకట స్థలానికి చేరుకున్నాడు. స్థానికులను పిలువగా, తన కుటుంబ సభ్యులు , మంటలను ఆర్పారు. అప్పటికే చాతి, చేతులు, ముఖము కాలిపోయినట్లు గుర్తించారు, కుటుంబ సభ్యులు వెంటనే యాచారం పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వృద్ధురాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధురాలిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో యువకుడు మృతి

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**షాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** షాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ధ్యానహిత హైస్కూల్‌లో విద్యుత్ మరమ్మతుల పనులు జరుగుతున్న సమయంలో కరెంటు షాక్‌కు గురైన యువకుడు సాయి తేజ(18) అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ స్తంభంపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కుప్పకూలినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సాయి తేజను విద్యుత్ మరమ్మతుల పనులకు సహాయకుడిగా తీసుకెళ్లారని, తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. విద్యుత్ ఉద్యోగులు తమ విధులను ఇతరులతో చేయించడం, రక్షణ పరికరాలు లేకపోవడం ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ప్రైవేట్ యువకునితో ప్రమాదకరమైన విద్యుత్ పనులు చేయించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు షాబాద్ సిఐ కాంతారెడ్డి తెలిపారు.

**మృతుడు విద్యుత్ శాఖ ఉద్యోగి కాదు:**

**షాబాద్ విద్యుత్ ఎ ఈ కోటేశ్వరరావు**

మృతుడు విద్యుత్ శాఖ ఉద్యోగి కాదని, శాఖ తరఫున అతడిని నియమించలేదని తెలిపారు. లైన్మెన్‌లకు సహాయకుడిగా పనిచేసేవాడని, విద్యుత్ శాఖ తరఫున మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చర్యలు తీసుకుంటాం.

## నేడు రైతు భరోసాపై వీడియో కాన్ఫరెన్స్

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 29,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో గల రైతు వేదికలలో మంగళవారం రైతుబరోసా నిధుల విడుదలపై విడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎదిర, చౌదరిగూడ, పెద్ద ఎల్కిచర్ల గ్రామాలలో గల రైతు వేదికలలో విడియో కాన్ఫరెన్సు ప్రసారం అవుతుందని ఆయన పెర్కోన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



గుండ్లపోచంపల్లిలో ఫారాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్

## ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపాలి

గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్

**మేడ్చల్, జూన్ 29, ప్రభాతవార్త:** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ జగ్జీవన్ రామ్ కాలనీలో ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఓలతో కలిసి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్ పైన ఓటర్లకు అవగాహన కల్పిస్తూ తప్పకుండా ఫారం నింపిన తర్వాత బిఎల్‌ఓలకు అందించాలని శ్రీనివాస్ సూచించారు. ఒకటికి రెండు సార్లు చదివి ఎలాంటి తప్పులు దొర్లకుండా ఫారాలను నింపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, బిఎల్‌ఓ కిరణ్, నాయకులు బుర్కాగాళ్ల శ్రీనివాస్, ఎక్కడిగాళ్ల కృష్ణ, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టు సవరణని పరిశీలించిన మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహుల్లు యాదవ్



గుండ్లపోచంపల్లిలో ఫారాలను పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహుల్లు యాదవ్

**మేడ్చల్, జూన్ 29, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్‌లో ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమాన్ని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహుల్లు యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం పూర్తి చేసి సంబంధిత బిఎల్‌ఓకు సమర్పించాలని సూచించారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్, డివిజన్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు భానుచందర్, బిఎల్‌ఓలు శశిధర్ రెడ్డి, విజయ్, జనార్ధన్, నాయకులు భాస్కర్, వెంకట్, షబ్బీర్, భాను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికను కాపాడండి



మేడ్చల్‌లోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకుడు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్

బిజెపి సీనియర్ నాయకుడు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్

**మేడ్చల్, జూన్ 29, ప్రభాతవార్త :** మేడ్చల్ డివిజన్‌లో కబ్జాకు గురైన స్మశాన వాటికను కాపాడాలని కోరుతూ మేడ్చల్ బిజెపి సీనియర్ నాయకుడు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ సోమవారం మేడ్చల్ జీహెచ్ఎంపీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని సర్వె నెంబర్ 1117 లో చేసిన లేఔట్ లో స్మశాన వాటిక ఉందని, ఆ స్మశాన వాటికను కొందరు కాంగ్రెస్ నాయకులు ఆక్రమించారని ఆరోపించారు. ఆక్రమించిన స్థలాన్ని స్మశాన వాటిక పక్కనే ఉన్న ప్లాట్ల నెంబర్‌తో బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత జెసిబి సహాయంతో చదును చేసి స్మశాన వాటిక రూపురేఖలు, హద్దులను తొలగించి ప్లాట్ల నెంబర్లతో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం దారుణంగా ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడటం దారుణంగా ఉందని, తాము ఏది చేసినా చెల్లుతుందనే దోరణిలో కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులు ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెబుతుంటే ఇక్కడ ఆ పార్టీ నాయకులు స్మశాన వాటికలను కూడ వదలకుండా కబ్జా చేసి అమ్ముకోవడం విడ్డూరంగా ఉందని తీవ్రంగా ఆరోపించాడు. జీహెచ్ఎంపీ అధికారులు వెంటనే స్మశాన వాటిక హద్దులను ఏర్పాటు చేయాలని, అదే విధంగా కబ్జా చేసి ఏర్పాటు చేసిన అక్కడి ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## బస్సులు సమయానికి వచ్చేట్లు చూడండి

సర్పంచ్ చంద్రభూపాల్ రావు

**కుల్కచర్ల, జూన్ 29 ప్రభాతవార్త:** ముజాహిద్‌పూర్ గ్రామంలో మాడల్ స్కూల్, మరియు హైస్కూల్ ఉన్నందున్న విద్యార్థులు అధిక సంఖలో బస్సు ప్రయాణంలో వస్తారని అందుకు బస్సులు సమయానికి వచేలా చర్యలు తీసుకోవాలనిసర్పంచ్ చంద్రభూపాల్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి పరిగి డిఎం ఇషాక్ బిన్ మహమ్మద్ రావడంతో సర్పంచ్ చంద్రభూపాల్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకలు డిఎం ఇషాక్ బిన్ మహమ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బస్సులు కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కండక్టర్ చంద్రయ్య, భీమయ్య గ్రామ నాయకులు పాల్గొన్నారు.




పరిగి డిఎం సన్మానిస్తున్న సర్పంచ్

# అలియాబాద్ ని ఆదర్శంగా నిలిపేందుకు సమన్వయంతో పనిచేయాలి

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త:**
అలియాబాద్ మున్సిపాల్టీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనిలో వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సాధారణ సమావేశంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలు, పారిశుద్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, మౌళిక వసతులు,హరిత ప్రాంతాల అభివృద్ధి పలు అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కార్యచరణ సిద్దం చేయటానికి నిర్ణయించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యచరణ ప్రణాళికను సమావేశం ఆమోదించినట్లు తెలిపారు. సుమారు రూ.కోటి.28లక్షల అంఛా వ్యయంతో, పురపాలక సంఘం 17శాతం వాటా నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పరిపాలనపరమైన అనుమతిని సమావేవంలో మంజూరు చేశారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు, సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కూడ చర్చించి అవసరమైన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఆదర్శ



.అలియాబాద్ మున్సిపల్ సాదారణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న వైస్‌చైర్మన్,కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు తదితరుల దృశ్యం

మున్సిపాల్టీగా మార్చాలని దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని, సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వసతులు, పరిశుభ్రమైన వాతావరణం అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను నాణ్యతా ప్రమాణాలతో అమలు చేయనున్నట్లు తెలిపారు. పలువురు కౌన్సిలర్లు వార్డులకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకరావటం జరిగిందని, వాటిపై చర్చించి నిర్ణయాలు తీసుకోవటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పని ఒత్తిడి అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 29, ప్రభాత వార్త:** పని ఒత్తిడితో పాటు అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి హోటల్ రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు స్థానిక పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. ఏపిలోని కంద్రిగకు చెందిన మృతుడు పరుచూరి మహేశ్ ( 40 ) కాకర్ల నిరోషాతో 12 సంవత్సరాల క్రితం వివాహం కాగా వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం కలిగారు. మూడేళ్ల క్రితం ఉద్యోగం నిమిత్తం మృతుడు మహేశ్ పోచారంలోని ఏఎస్‌బీఎల్ స్ప్రింగ్స్ అపార్టుమెంటులో ప్లాటు కొనుగోలు చేసి నివాసం ఉంటు నగరంలోని హైటెక్ సిటీలోని ఎన్‌టీటీ డాటా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కంపెనీలోని పని ఒత్తిడితో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. ఈ నెల 28వ తేదిన కంపెనీలో స్పోర్ట్స్ ఈవెంట్ ఉందని ఇంట్లో చెప్పి ఇంటికి రాలేదు. దీంతో మృతుడి భార్య నిరోషా భర్త మహేశ్ కొరకు సహచర ఉద్యోగి నవీన్‌ను సంప్రదించిన ఆచూకీ లభించలేదు. తాను మృతుడ్ని అదేరోజు ఆరున్నర గంటల సమయంలో అన్నోజిగూడ డీ మార్ట్ వద్ద వదలివేసినట్లు తెలిపారు. బంధు మిత్రులతో పాటు అన్ని చోట్ల వెతికిన భర్త ఆచూకీ లభించకపోవడంతో మృతురాలు భార్య పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి మృతుడి ఆచూకీ ఫోన్ లోకేషన్ సేకరించగా చౌదరిగూడలోని సేటన్ హోటల్ ఉన్నట్లు తెలిసింది. దీంతో హోటల్‌లోని 206 రూంను తెరిచిచూడగా మహేశ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బెడ్‌పైన గల బేడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆఫీస్‌లో పని ఒత్తిడితోపాటు అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య నిరోషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

# నాడు ఎరుగని ధృతరాష్ట్రుడి పాలన..నేడు గుర్తుకొచ్చిందా..

**-కేటీఆర్ పై మండిపడ్డ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్**

**వికారాబాద్, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో కేటీఆర్, హరీష్‌రావులకు పిచ్చెక్కినట్లు ప్రవర్తిస్తున్నారని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ, గతంలో 2014లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు బిఆర్‌ఎస్ కండువాలు కప్పి దృతరాష్ట్రుడి పాలన కొనసాగించారని గుర్తు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ పార్టీ మారారని అభియోగం మోపిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగ బద్ధంగా తీర్పు నిచ్చారని, ఏదైన సందేహాలు ఉంటే మళ్ళీ అప్పీలు చేసుకోవాలని సూచించారు. ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను దృతరాష్ట్రుడితో పోల్చడం సరైందికాదని అన్నారు. హామీల అమలు విషయానికి వస్తే..కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అమలులో ఎంతో స్పష్టతతో ముందుకెళ్తుందని, ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, రుణమాఫీ, సబ్సిడీ పై గ్యాస్ సిలిండర్, పింఛన్లు, ఉచిత కరెంటు వంటి పథకాలు అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం సంక్షేమంలో ముందుందని తెలిపారు. అభివృద్ధి విషయానికి వస్తే..ఎన్నికల సమయంలో గత ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ జీవో కాపీలు తీసుకువచ్చి ఆర్థిక శాఖ అనుమతులు సైతం తీసుకోలేరని, దీంతో వికారాబాద్ ప్లై ఓవర్ బ్రిడ్జీ పనులు, ఇతర రోడ్ల నిర్మాణాలు నిలిచి పోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో ఆ నిధులు మంజూరు చేయడంతో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. బీజాపూర్ రహదారి పనులు సైతం సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవ వల్లనే ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు. జిల్లాలోని కోటపల్లి ప్రాజెక్టు ఆధునీకరణ పనుల కోసం దాదాపు 100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, పనులు సైతం ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ధారాసింగ్

విమర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 2014లో 65 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే..బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయే సమయంలో 8.12 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. కోటపల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్ పెట్టి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తమ ప్రాంత ప్రజల సొమ్మును దోచుకెళ్తున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తి కూడా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ, అవినీతికి మారు పేరు అయిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ స్పీకర్‌పై అసత్యపు మాటలు మాట్లాడటం విడ్డూరమన్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్ పదవికి రూ.2 కోట్లు, పీఏసీఎస్ చైర్మన్ పదవి కి 1.30 కోట్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రూ.20 లక్షలు వసూలు చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కు దక్కుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాలి తప్ప అసత్య ఆరోపణలు చేయడం బీఆర్‌ఎస్ నేతలు మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గద్దం అనన్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, కౌన్సిలర్లు చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, మల్లికార్జున్ గౌడ్, రాకేష్, మధుకర్, వికారాబాద్, బంట్వారం మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, పోచారం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని వినతి

**షాబాద్, జూన్ 29, ప్రభాతవార్త :** షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అవసరమైన అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్, కిచెన్ రూమ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని పాం˘శాల ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి రాముకు సోమవారం వినతిపత్రం అంద˘జేశారు. ఈ సందర్భంగా పాఠ శాలను సందర్శించిన రాము పాఠశాలలో అవసరమైన సదు పాయాలను పరి శీలించి, రౌండ్ టేబుల్ ఇండియా ఫౌండేషన్ ద్వారా పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే అంశాన్ని సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామని తెలిపారు. త్వరలో అడాప్ట్ ప్రోగ్రామ్, ఫౌండేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జెడ్ పి ఎస్ హెచ్ షాబాద్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి, కార్యదర్శి ఈశ్వర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ రాహుల్ గుప్తా, మాజీ సర్పంచ్ వెంకట్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు యాదగిరి చారి, లింగం, పూర్వ విద్యార్థులు శ్రీనివాస చారి, ముత్యం రెడ్డి, దర్పల్లి రవీందర్ గౌడ్, భైరంపల్లి నవీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నక్షబాట ఆక్రమణకు గురైందని ఫిర్యాదు


ఉప తహసీల్దారు భాస్కర్‌కు ఫిర్యాదు పత్రాలను అందజేస్తున్న తూంపల్లి గ్రామస్తులు

**జిల్లెడు చౌదరిగూడ,జూన్ 29,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామంలో గల నల్లకుంట చెరువులో గల నక్షబాట ఆక్రమనకు గురైందని గ్రామస్తులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెరువులో గల సర్వే నెంబర్ 52లో పూర్వ కాలం నుంచి నక్షబాట ఉండేదని ప్రస్తుతం కొంత మంది నక్షబాటకు మట్టిపోసి ఆక్రమిస్తున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నక్షబాటను ఆక్రమనకు గురికాకుండ చేడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర, పవన్, చంద్రకాంత్, యాదగిరి, అంజయ్య తదితరులు ఉన్నారు.

## మజీద్‌పూర్ బేకరీలో పోలీసుల తనిఖీలు..కేసు నమోదు

**..జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ సిఐ గోపగాని గురువయ్యగౌడ్**

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త:**
మజీద్‌పూర్‌లోని ఎంసిఆర్ బేకరినీ జీనోమ్‌వ్యాలీ పోలీసులు, ఎస్‌ఓటి పోలీసులు సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ గోపగాని గురవయ్యగౌడ్ తెలిపారు. శామీర్‌పేట మండల పరిధిలోని మజీద్‌పూర్‌లోని ఎంసిఆర్ బేకరిని స్థానిక జీనోమ్‌వ్యాలీ పోలీసులు,ఎస్‌ఓటి పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. పోలీసుల తనిఖీల్లో (ఎంసిఆర్ బేకరిలో) నిషేధిత సింథటిక్ రంగులు, గడువు ముగిసిన ఫుడ్‌ప్లేవర్లు ను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులకు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ప్రభుత్వం నిషేధించిన హానికరమైన సింథటిక్ ఫుడ్ కలర్స్, గడువు ముగిసిన ఫుడ్ పేవర్లు నిల్వ ఉంచి బేకరీలో ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్, ఫుడ్‌సేఫ్టీ శాఖ అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిందని సిఐ గురువయ్యగౌడ్ తెలిపారు. పోలీసులు మొత్తం 16రకాల ఫుడ్ ఫేవర్లు, సింథటిక్ రంగులు, గడువు ముగిసిన వస్తువులను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. బేకరీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రజలు ఆహార పధార్థాలు కొనుగోలు చేసే ముందు పరిశీలించాలి**

ఆహారపధార్థాలు కొనుగోలు చేసే సమయంలో వాటి తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత, తప్పనసరిగా పరిశీలించాలని జీనోమ్‌వ్యాలీ పిఎస్ సిఐ గోపగాని గురువయ్యగౌడ్ సూచించారు. నిషేధిత పదార్థాల వినియోగం ఆరోగ్యానికి తీవ్రమైన హాని కల్గిస్తుందన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల పై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్ లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించాలని సిఐ గురువయ్యగౌడ్ ప్రజలకు సూచించారు.

## అర్హులైన యువత ఓటరు నమోదు చేసుకోవాలి

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్ డివిజన్‌లో సోమవారం ఇంటింటికి ఓటరు సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఓటరు ఎమ్యూనరేషన్ పత్రాలను బిఎల్‌ఓలు అందజేస్తుండగా ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో ఆయన పర్యవేక్షించారు. ప్రజలు ఎన్యుమరేషన్ ఫారాలలో వివరాలు పూరించి సమర్పించాలని, 18 ఏవత్సరాలు పూర్తి చేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించి ప్రక్రియను పారదర్శంగా నిర్వహించాలని బిఎల్‌ఓలకు సూచించారు.డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కీసరగుట్ట డైరక్టర్ సామల అమర్, మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేశ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కర్రె రాజేశ్, మాజీ సర్పంచులు మొదబోయిన వెంకటేశ్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందుల కుమార్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, సొసైటి మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, మాజీవార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి, గడీల సంజీవరెడ్డి, గుర్జకుంట నర్సింహ్మా, మీసాల సుధాకర్‌రావు, నానావత్ సురేశ్‌నాయక్, వేముల శంకర్‌గౌడ్, నాయకులు ఎం.ఎ.రహమాన్, రాజారత్నం, మోత్కుపల్లి శ్రీనివాస్, అశ్రఫ్‌అలీ, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, మేకల సునీల్‌కుమార్, కడపొల్ల సుధాకర్,పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన 93 దరఖాస్తులను అధికారులకు సమర్పించారు.

ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని అన్నారు. ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌ఓ స్వర్ణలత, డిఆర్డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

# శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవాలు

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త:**
అలియాబాద్‌లోని శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గత ఏడాదిలో ఈ ఆలయాన్ని నిర్మించి ప్రారంభించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సారి ఈ ఆలయ ప్రథమ వార్షికోత్సవంను పురస్కరించుకుని వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి పాల్గొని శ్రీ భక్త మార్కండేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి, యమునశ్యామ్, స్వప్నరాంప్రసాద్, మౌనికబాబు, మౌనికదినేశ్, దీపికవరప్రసాద్, పలువురు భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

# విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, సామాగ్రి పంపిణీ

**..గత పదిహేను సంవత్సరాలుగ విద్యార్థులకు సేవలు**

**..శామీర్‌పేట మండల విద్యా అధికారి ఆర్.కమలాకర్**

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త:**
బొమ్మరాసిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'సంపర ఫౌండేషన్' వారు ఉచితంగా నోట్‌బుక్స్‌ను, కంపాక్స్ బాక్స్‌లను అందజేశారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంపర ఫౌండేషన్ వారు నోట్‌బుక్స్‌ను,కంపాక్స్ బాక్స్‌లను పంపిణీ చేశారు. సంపర ఫౌండేషన్ చైర్మన్ సంపర శేఖర్, వైస్‌చైర్మన్ విక్రమ్, సభ్యులు కల్యాణి, ప్రశాంతిలు విచ్చేసి విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, కంపాక్స్ బాక్స్‌లను అందజేసినట్లు స్థానిక ప్రధానోపాధ్యాయులు, శామీర్‌పేట మండల విద్యా అధికారి ఆర్.కమలాకర్ తెలిపారు.గత పదిహేను సంవత్సరాల నుంచి బొమ్మరాసిపేట్ విద్యార్థులకు సంపర ఫౌండేషన్ వారు సేవలు అందిస్తున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి కూడ అనేక రకాలుగ వారు సహకరిస్తున్నారని వారికి ఆయన దన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటిన వారికి స్కాలర్‌షిప్స్‌ను కూడ వార అందజేసి విద్యార్థులను సంపర ఫౌండేషన్ వారు ప్రోత్సహిస్తున్నారని వారి కృషి అభినందనీయమన్నారు. ఉప్పరిపల్లి నుంచి బొమ్మరాసిపేట్‌కు వస్తున్న విద్యార్థుల రవాణా కోసం ఉచితంగా ఆటోను కూడ మాట్లాడి సహకరిస్తున్నారని అన్నారు. సంపర వైస్‌చైర్మన్ విక్రమ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, ఉన్నత చదువులు చదవాలని సమాజానికి సహాయం చేసే విధంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు ఉపాద్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


బొమ్మరాసిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంపర ఫౌండేషన్ వారు ఉచితంగా నోట్‌బుక్స్,కంపాక్స్‌లు అందజేసిన దృశ్యం,పాల్గొన్న ఎంఇఓ కమలాకర్, సంపర ఫౌండేషన్ ప్రముఖుల దృశ్యం

# నేను మాటలు చెప్పే మనిషిని కాదు,పనిచేసి చూపిస్తా: ఎమ్మెల్యే

**బషీరాబాద్,జూన్ 29,ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్,ఎక్మాయి తదితర గ్రామాలను తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సందర్శించారు.మైల్వార్ గ్రామంలోని బూత్ సంఖ్య 237-239,ఎక్మాయి గ్రామంలోని బూత్ నంబర్ 241-243,లతో పాటు మండల కేంద్రంలోని బూత్ నంబర్ 250-256 లలో తిరిగి ఓటరు జాబిత సవరణ ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల నుండి ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని ఓటర్లకు స్వయంగా ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం అని అన్నారు.ప్రతి పౌరుడు తన ఓటు వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు చేర్పుల కోసం సార్ పత్రాలను పూరించి సంబంధిత అధికారులకు ఇవ్వాలని సూచించారు.దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థా మరింత బలపడుతుందని అన్నారు.రాష్ట్రంలో పేదోడు సన్నబువ్వ తినాలనే సంకల్పతో,రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామన్నారు.

బషీరాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజి ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించి తరగతులను కొనసాగిస్తున్నామన్నారు.అభివృద్ధి విధానాల ప్రకారం గ్రామస్థాయి నుంచి ప్రతి పౌరుడికి సంక్షేమ ఫలాలుఅందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

# హకీంపేట్ రైతులకు పునరావాస, పరిహార ప్యాకేజీ


గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

**దుద్యాల్, జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ లో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ వెంకటచారి ఆధ్వర్యంలో గ్రామ రైతులకు పునరావాస మరియు పరిహార ప్యాకేజీకి సంబంధించి గ్రామసభను నిర్వహించారు. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కొరకు 100 భూములు కోల్పోతున్న 9 ప్రభావిత కుటుంబాలకు పునరావాసం కొరకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున అదనముగా పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఎకరాకు 20 లక్షల ల్యాండ్ వాల్యూ ఎక్కరాకు 150 గజాల ఫ్లాటుతోపాటు నిర్మాణ వ్యయం కూడా చెల్లించడం జరుగుతుందని తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ తో పాటు, ఆర్డీవో అనిత, తహసిల్దార్ కిషన్, ఆర్ఐ నవీన్ కుమార్, జిపివో రమేష్, పంచాయతీ సెక్రటరీ ఆనంద్, రైతులు, మల్లికార్జున్, వీరభద్రయ్య, కాలప్ప, కృష్ణయ్య, మోనప్ప తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు..

**దుద్యాల్, జూన్ 29, ప్రభాతవార్త:** నూతనంగా గ్రామ పంచాయతీలుగా మారిన గిరిజన తండాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. గిరిజన తండాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈనెల 1 న కొడంగల్ లో నిర్వహించే లంబాడ హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు రాజేష్ కుమార్, గోవింద్ జిల్లా అధ్యక్షుడు సూర్య నాయక్, ప్రకాష్, ఎస్టీ సెల్ దుద్యాల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సిఎంకు వినతి పత్రం అందిస్తున్న ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు

## ఎల్ హెచ్ పి ఎస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ..


వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు..

**దుద్యాల్, జూన్ 29, ప్రభాతవార్త:** ఎల్ హెచ్ పి ఎస్ 30 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 1న కొడంగల్ పట్టణంలో నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవం వాల్ పోస్టర్ ను మండల పరిధిలోని వాల్యా నాయక్ తండాలో ఆవిష్కరించారు. ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్య నాయక్, సర్పంచ్ దేవీ రవీందర్ నాయక్ లు మాట్లాడుతూ, ప్రతి తాండ నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో హరినాయక్, శంకర్ నాయక్, మోహన్, విజయ్, శ్రీకాంత్, రాందాస్, అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో సంకల్పయాత్ర ర్యాలీ

**..శామీర్‌పేటలో ఘనంగా స్వాగతం పలికిన మైనం**

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంకల్పయాత్ర ర్యాలీ చేస్తున్న వారికి శామీర్‌పేటలో వారికి ఘన స్వాగతం లభించింది. సోమవారం శామీర్‌పేటకు సంకల్పయాత్ర ర్యాలీ చేరుకోవటంతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధనయక్షులు ఓరగంటి ఆనంద్ బృందాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు దండుగుల మైసయ్య ఘనంగా స్వాగతం పలికి ఆయనను ఘనంగా సన్మానించారు. అయితే అదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం 101కార్లతో ర్యాలీని నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆ ర్యాలీ రాజీవ్‌రహదారిన శామీర్‌పేటకు చేరుకోవటంతో ఆయన ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలంతో పాటు ఫించన్లు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.మాదవి, జిల్లా కోశాధికారి డాకూరి దశరథ, రవి, డి.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేటలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో జరుగుతున్న సంకల్పయాత్ర ర్యాలీకి శామీర్‌పేటలో స్వాగతం పలికిన రాష్ట్ర నాయకులు డి.మైసయ్య, తదితరుల దృశ్యం

## నేడు బిజెపి రాష్ట్రకార్యవర్గ సమావేశం

**-జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రుల రాక**

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని రాక్‌ఎన్‌క్లేవ్ కన్వెన్షన్‌లో మంగళవారం భారతీయ జనతాపార్టీ కార్యవర్గసమావేశం జరుగుతుందని మేడ్చల్ జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు తెలిపారు. బిజెపి రాష్ట్రశాఖ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సమావేశంలో జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.